# నేను లేకుండా ఉండలేడు..

బాలీవుడ్ రొమాంటిక్ హీరో రాజేశ్ ఖన్నా.. తను లేకుండా ఉండేవాడు కాదని అంటున్నది సీనియర్ నటి అనితా అద్వానీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తమ మొదటి పరిచయం గురించి, తర్వాత వారి అనుబంధం గురించీ చెప్పుకొచ్చింది. ఇన్నేళ్లలో వారి బంధం ఎలా బలపడిందో వెల్లడించింది. అనిత టీనేజీలో ఉన్నప్పుడు ఓ సినిమా షూటింగ్‌కు వెళ్లిందట. అక్కడే రాజేశ్ ఖన్నాను మొదటిసారిగా చూసినట్లు చెప్పుకొచ్చింది. ''అప్పటికే అతనో సూపర్‌స్టార్. అంత పెద్ద నటుణ్ని అంత దగ్గరగా చూడటం అదే మొదటి సారి. ఆ క్షణంలోనే ఆయన రూపం నా మనసులో శాశ్వతంగా ముద్రపడిపోయింది. ఆ సందర్భం ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతూనే ఉంటుంది'' అంటూ నాటి సంగతులను గుర్తు చేసుకున్నది. తెలిసినవాళ్లతో కలిసి రాజేశ్ ఇంటికి వెళ్లిమరీ అతణ్ని కలిసిందట. కొద్దిరోజులకే ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగిందనీ, కొన్నేళ్లపాటు రాజేశ్‌తో డేటింగ్ చేశాననీ చెప్పుకొచ్చింది. ''రాజేశ్ ఎప్పుడూ నాకు 'ఐలవ్యూ' చెప్పలేదు. అతను అందరిలాంటివాడు కాదు. నేను లేకుండా జీవించలేడు. నేను బయటకు వెళ్తే.. కనీసం 20 సార్లయినా ఫోన్ చేసేవాడు'' అంటూ వెల్లడించింది. ఇక అప్పట్లోనే అనిత ఒక కేఫ్ తెరిస్తే.. రాజేశ్ ఖన్నా పట్టుబట్టి మరీ దాన్ని మూయించాడని చెప్పింది. బాలీవుడ్‌లో రొమాంటిక్ హీరోగా ముద్రపడ్డ రాజేశ్ ఖన్నా.. ఆరాధన, అందాజ్, ఔరత్, ఖామోషీ, డోలీ, బంధన్ లాంటి అనేక హిట్ సినిమాలతో టాప్ హీరోగా వెలుగొందాడు. ఇక అనితా అద్వాని విషయానికి వస్తే.. దాసీ, శాలీమార్, ఆవో ప్యార్ కరే, చోర్నీ సినిమాలతో బీటౌన్ ప్రేక్షకులకు దగ్గరైంది.






నమస్తే తెలంగాణ

# జిందగీ

ఆదివారం | 16 మార్చి 2025 | II

హైదరాబాద్ | www.ntnews.com


# కొత్త థ్రిల్

ఓటీటీ హిట్

## రేఖా చిత్రం

**సోనిలివ్, ఆహా:** స్ట్రీమింగ్ అవుతున్నది
**తారాగణం:** అసిఫ్ అలీ, అనస్వర రాజన్, మనోజ్ కె జయన్ తదితరులు.
**దర్శకత్వం:** జోఫిన్ టి చాకో

కథలో కొత్తదనం.. కథనంలో విలక్షణాన్ని చూపిస్తూ అద్భుతమైన సినిమాలను తెరకెక్కిస్తున్నారు మలయాళీలు. అందులోనూ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, థ్రిల్లర్ జానర్‌కు పెద్దపీట వేస్తున్నారు. తాజాగా, రూ.10 కోట్లతో తెరకెక్కిన 'రేఖా చిత్రం' సినిమా.. బాక్సాఫీస్ దగ్గర రూ.55 కోట్లను కొల్లగొట్టింది. మలయాళంలో గ్రాండ్ సక్సెస్ సాధించిన చిత్రాల జాబితాలో చేరిపోయింది. 'సోనిలివ్'తోపాటు 'ఆహా'లోనూ స్ట్రీమింగ్‌కు వచ్చి.. ఇక్కడా హిట్ టాక్‌తో దూసుకెళ్తున్నది. మరి అంతగా అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ చిత్రంలో ఏముంది?

**విలక్షణమైన** కథనంతో నడుస్తుందీ సినిమా. రాజేంద్రన్ (సిద్ధిఖీ) శ్రీమంతుడు. ఒకరోజు ఆయన ఓ అటవీ ప్రాంతానికి వెళ్తాడు. ఒక చెట్టుకింద కూర్చుని.. గతంలో చేసిన ఓ పాపం తనని వెంటాడుతున్నదని ఆవేదన చెందుతాడు. తనతోపాటు తన మిత్రులు కలిసి ఓ 18 ఏళ్ల అమ్మాయిని ఆ చెట్టు కిందే పూడ్చిపెట్టామని చెబుతూ.. ఫేస్‌బుక్‌లో లైవ్ వీడియో తీస్తాడు. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకుంటాడు. అదే రోజున ఆ ఏరియా పోలీస్ స్టేషన్‌లో వివేక్ గోపీనాథ్ (అసిఫ్ అలీ) చార్జ్ తీసుకుంటాడు. ఇదే కేసు మీద ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టిన వివేక్.. రాజేంద్రన్ చెప్పిన చోట తవ్వి చూస్తే అక్కడ అస్థిపంజరం దొరుకుతుంది. దానికి ఉన్న కాలు పట్టీల ద్వారా అది ఒక అమ్మాయిదే అనే నిర్ధారణకు వస్తారు. మరి ఎవరా అమ్మాయి? ఆమె కుటుంబ నేపథ్యం ఏమిటి? ఆమెను ఎవరు, ఎందుకు చంపుతారు? ఈ హత్య కేసును వివేక్ ఎలా ఛేదిస్తాడు? అనేది మిగతా కథ. కాన్సెప్ట్ పాతదే అయినా.. కొత్తగా చెప్పాలనే మాటకు 'రేఖా చిత్రం' మంచి ఉదాహరణగా నిలుస్తుంది.



# స్వీట్స్ ప్లీజ్!

అతిలోకసుందరి శ్రీదేవి తనయ జాన్వీకపూర్.. స్వీట్స్‌పై మనసు పారేసుకుంది. తాజాగా, తన ఇన్‌స్టా హ్యాండిల్‌లో 'మాల్పువా, రబ్డీ' ఫొటోను షేర్‌చేసి.. 'హైదరాబాద్‌లో ఈ స్వీట్స్ ఎక్కడ దొరుకుతాయో చెప్పండి ప్లీజ్!' అంటూ రాసుకొచ్చింది. ఇంట గెలిచి, రచ్చ గెలవాలని చూస్తున్న జాన్వీ.. బాలీవుడ్‌తోపాటు టాలీవుడ్‌లోనూ వరుసగా అవకాశాలను దక్కించుకుంటున్నది. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా, సానా బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తున్నది. అటు హిందీలోనూ.. వరుణ్ ధావన్ సరసన 'సన్నీ సంస్కారీకి తులసి కుమారి', సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి చేస్తున్న 'పరమ్ సుందరి' సినిమాలతో బిజీగా ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్ – ముంబయి మధ్య చక్కర్లు కొడుతున్నది. ఖాళీ చిక్కినప్పుడల్లా సామాజిక మాధ్యమాల ద్వారా తన అభిమానులతో ఏదో ఒక అప్‌డేట్‌ను పంచుకుంటున్నది. ఇటీవలే కేరళలో 'పరమ సుందరి' సినిమా షూటింగ్ సందర్భంగా జరిగిన కొన్ని సరదా సంఘటనలను పంచుకున్నది. సూర్యుడి కింద ప్రశాంతమైన పడవ ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ దిగిన ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. తాజాగా, హైదరాబాద్‌లోనూ మాల్పువా – రబ్డీ (స్వీట్) ఫొటోను షేర్ చేసి.. 'హైదరాబాద్‌లో ఈ స్వీట్స్ ఎక్కడ దొరుకుతాయో చెప్పండి!' అంటూ రాసుకొచ్చింది.



# ఎవరీ గౌరీ?

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్.. ముచ్చటగా మూడోసారి ప్రేమలో పడ్డాడు. రీనా దత్తా, కిరణ్ రావుతో వివాహబంధానికి ముగింపు పలికిన ఈ బాలీవుడ్ టాప్‌హీరో.. గౌరీ స్ప్రాట్ అనే మహిళతో కొన్నాళ్లుగా డేటింగ్‌లో ఉన్నాడు. ఈ విషయాన్ని స్వయంగా ఆమిర్ ఖానే వెల్లడించాడు. తాజాగా తన 60వ పుట్టినరోజు సందర్భంగా మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించాడు. ఈ సందర్భంగా తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌తో డేటింగ్ సహా, తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారత్', షారుఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్‌తో స్నేహం.. ఇలా పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ''గౌరీ, నేను పాతికేళ్లుగా స్నేహితులం. ఏడాది కాలంగా ఇద్దరం డేటింగ్‌లో ఉన్నాం!'' అంటూ వెల్లడించాడు. దాంతో, 'ఎవరీ గౌరీ?' అంటూ నెటిజన్లు తెగ సెర్చ్ చేస్తున్నారు. ఆమె వివరాలను ఒక్కొక్కటిగా తెలుసుకుంటూ.. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన గౌరీ స్ప్రాట్.. ప్రస్తుతం ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో పనిచేస్తున్నది. ఫ్యాషన్ కోర్సుతోపాటు లండన్ యూనివర్సిటీలో స్టయిలింగ్ అండ్ ఫొటోగ్రఫీ ట్రైనింగ్ తీసుకుంది గౌరి. గతంలోనే ఐర్లాండ్‌కు చెందిన ఓ వ్యక్తిని పెళ్లాడిన ఆమె.. కొన్నేళ్ల కిందే అతనితో విడిపోయింది. ప్రస్తుతం తన ఆరేళ్ల కొడుకుతో కలిసి బెంగళూరులోనే ఉంటున్నది. ఈమె తల్లి కూడా సెలెబ్రిటీ స్టయిలిస్ట్. వీరికి బెంగళూరు, ముంబయి నగరాల్లో సెలూన్లు ఉన్నాయి. ఏడాదిన్నరగా డేటింగ్‌లో ఉన్న ఆమిర్ – గౌరి బంధానికి ఇరు కుటుంబాలు ఓకే చెప్పాయట. దాంతో.. తమ బంధం గురించి బయటపెట్టాడు ఆమిర్. 1986లో రీనా దత్తాను పెళ్లి చేసుకున్న ఆమిర్.. 2002లో విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత బాలీవుడ్ మహిళా డైరెక్టర్ కిరణ్ రావుతో ప్రేమలో పడి.. 2005లో పెళ్లిపీటలెక్కాడు. ఈ జంట కూడా 2021లో విడిపోయిన సంగతి తెలిసిందే.





# అదే కథ.. విచిత్రంగా

**ఎప్పటి తిన్నడు?**
**ఎవరీ కన్నప్ప??**
**'కాళహస్తి మహాత్యం'గా 70 ఏండ్ల కిందట పలకరించాడు.**
**'భక్త కన్నప్ప'గా మరోసారి 49 ఏండ్ల క్రితం భక్త వ'శంకరుడి' లీలను చాటాడు.**
**మళ్లీ ఇప్పుడు 'కన్నప్ప'గా కన్నార్పకుండా తనను చూడమంటున్నాడు!**
**కన్నప్ప కథ.. ముచ్చటగా మూడోసారి వెండితెరపై వెలుగులు పంచనున్నది.**
**ఒక్క కన్నప్ప కథ మాత్రమే కాదు.. మరెన్నో సినిమాలు తెలుగు తెరపై మళ్లీ మళ్లీ రూపుదిద్దుకున్నాయి. అందులో కొన్ని గత చిత్రాల కన్నా వైభవంగా ఆడాయి. మరికొన్ని ఉస్సూరుమనిపించాయి. అలా తెలుగు తెరపై అదే కథతో, ఇంచుమించు అదే కథనంతో పునర్ నిర్మితమైన సినిమాల ముచ్చట్లు ఇవి..**

రామాయణం ఎన్నిసార్లు విన్నా రమణీయమే! ఆదికవి వాల్మీకి అపురూప సృష్టిని.. తర్వాతి కాలంలో ఎందరో కవులు మళ్లీ మళ్లీ ఆవిష్కరించారు. వ్యాస విరచిత మహాభారతాన్నీ... కవిత్రయం మొదలుకొని మరెందరో మళ్లీ రచించారు. వేటి గొప్పదనం వాటిదే! కాస్త డొక్కశుద్ధి ఉన్న కవులు తిరగరాసినప్పుడు.. ఆ కావ్య గరిమ మరింత ఇనుమడించింది. అంతగా అవగాహన లేకుండా రాసి, ఆదరణ పొందని సందర్భాలూ ఉన్నాయి. సినిమాల్లోనూ అంతే! మొట్టమొదటి టాకీ చిత్రంగా విడుదలైన 'భక్త ప్రహ్లాద' తర్వాతి కాలంలో మూడుసార్లు మళ్లీ నిర్మితమైంది. మొదటి భక్త ప్రహ్లాద 1932లో విడుదలైంది. దీనికి హెచ్‌ఎం రెడ్డి దర్శకుడు. తర్వాత పదేండ్లకు చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో 'భక్త ప్రహ్లాద' విడుదలైంది.



తర్వాత 16 ఏండ్లకు దాదాపు ఇదే కథతో బీఏ సుబ్బారావు దర్శకత్వంలో 'చెంచులక్ష్మి' సినిమా వచ్చింది. ప్రహ్లాదుడి కథకు కొనసాగింపుగా చెంచులక్ష్మి, నరసింహస్వామి పెండ్లి కథను ముడిపెట్టి దీనిని నిర్మించారు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది. మళ్లీ 1967లో చిత్రపు నారాయణరావు డైరెక్షన్‌లో 'భక్త ప్రహ్లాద' వచ్చింది. ఈ చిత్రం అపూర్వ విజయం సొంతం చేసుకుంది. విచిత్రం ఏమిటంటే 'చెంచులక్ష్మి', 'భక ప్రహ్లాద' (1967) రెండిట్లోనూ హిరణ్యకశిపుడిగా ఎస్వీఆర్ నటించాడు. మొత్తానికి ప్రహ్లాద చరితం నాలుగుసార్లు తెలుగు ప్రేక్షకులను అలరించింది. ఈ తరం నటుడు రానా బకెట్ లిస్ట్‌లో 'హిరణ్యకశిప' ప్రాజెక్టు ఉందని చాలాకాలంగా వినిపిస్తున్న మాట! అది పట్టాలెక్కితే ప్రహ్లాద చరిత్ర తెలుగులో ఐదుసార్లు తెరకెక్కిన చిత్రమవుతుంది.

### కన్నప్ప మూడోసారి

కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నటించిన ఏకైక తెలుగు చిత్రం 'కాళహస్తి మహాత్యం'. తిన్నడుగా రాజ్‌కుమార్ నటించిన తీరు విమర్శకుల ప్రశంసలనూ అందుకుంది. హెచ్‌ఎల్‌ఎన్ సింహా దర్శకత్వం వహించిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఘంటసాల గాత్రం ఈ సినిమాకు అదనపు బలాన్నిచ్చింది. ఇందులోని పాటలు ఇప్పటికీ శివాలయాల్లో మార్మోగుతూ ఉంటాయి.

కైలాసనాథ శాస్త్రిగా ముదిగొండ లింగమూర్తి అభినయం అద్భుతః అనిపిస్తుంది. ఆయన కొడుకు కాశిగా పద్మనాభం నటన ఇప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమా విడుదలైన రెండు పుష్కరాలకు 1976 బాపు దర్శకత్వంలో 'భక్త కన్నప్ప' వచ్చింది. ఇందులో కన్నప్పగా కృష్ణంరాజు జీవించాడనే చెప్పాలి. ఆయనకు జోడిగా వాణిశ్రీ అభినయించింది. కైలాసనాథ శాస్త్రిగా రావుగోపాలరావు అదరగొట్టాడు. సినిమాకు సత్యం మాస్టారు సంగీతం అందించాడు. ఇందులోని కిరాతార్జునీయం గీతం వేటూరి రచనా వైచిత్రిని చాటి చెబుతుంది. 'శివశివ శంకర.. భక్త వశంకర' గీతంలో ఆయన ప్రయోగించిన అలంకారాలు.. పండిత పామరులనూ అలరించాయి. మళ్లీ దాదాపు 49 సంవత్సరాల తర్వాత మరోసారి వెండితెరపై వెలిగేందుకు కన్నప్ప సిద్ధమవుతున్నాడు.

> **తెలుగు** తెర అదృష్టంగా భావించే చిత్తూరు నాగయ్య నటించిన ఎన్నో సినిమాలు తర్వాతి కాలంలో మళ్లీ రూపుదిద్దుకున్నాయి. ఆయన నటించిన 'భక్త పోతన', 'త్యాగయ్య', 'రామదాసు', 'యోగి వేమన' చిత్రాలు కొన్ని దశాబ్దాల తర్వాత పునర్ నిర్మితమయ్యాయి. 'భక్త పోతన' గుమ్మడి ప్రధాన పాత్రగా మళ్లీ రూపుదిద్దుకుంది. అయితే ఇది పరాజయం పాలైంది. ఇక రెండో 'త్యాగయ్య'లో సోమయాజులు ప్రధాన పాత్ర పోషించాడు. దీనికి బాపు దర్శకత్వం వహించాడు. నాగయ్య నటించిన 'యోగి వేమన' కథతో కొన్ని దశాబ్దాల తర్వాత విజయ్‌చందర్ హీరోగా 'శ్రీవేమన చరిత్ర'గా విడుదలైంది. ఓ మోస్తరుగా ఆడిందంతే! నాగయ్య జీవితాన్ని అతలాకుతలం చేసిన సినిమా 1964లో వచ్చిన 'రామదాసు'. ఈ చిత్రానికి నాగయ్యే దర్శక, నిర్మాత. ఆయన మీద అభిమానంతో ఎన్టీఆర్, ఏయన్నార్ ఇందులో అతిథి పాత్రలు పోషించారు. అయినప్పటికీ ఈ సినిమా నాగయ్యను నిలబెట్టలేకపోయింది. మళ్లీ 42 సంవత్సరాలకు రామదాసు కథతోనే రాఘవేంద్రరావు, నాగార్జున కాంబినేషన్‌లో వచ్చిన 'శ్రీరామదాసు' చరిత్ర సృష్టించింది. ఇందులోనూ ఏయన్నార్ నటించడం విశేషం.

పాత కథకు పలు చారిత్రక అంశాలను జోడించి ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కించామని హీరో మంచు విష్ణు చెబుతున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు జనాదరణ పొందాయి. ఏప్రిల్ 25న 'కన్నప్ప' ప్రేక్షకులను పలకరించనున్నాడు.

**అప్పుడెప్పుడో** వచ్చి.. ఆ తర్వాత మళ్లీ అదే కథతో వచ్చి అలరించిన సినిమాలు ఒకటో రెండో కాదు... ఎన్నెన్నో ఉన్నాయి. 'దేవదాసు' 1953లో విడుదలై అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. అక్కినేని, సావిత్రి నటన, సముద్రాల పాటలు, వేదాంతం రాఘవయ్య దర్శకత్వం, సీఆర్ సుబ్బురామన్ సంగీతం 'దేవదాసు'ను అపురూప చిత్రాల జాబితాలో చిరస్థాయిగా నిలబెట్టాయి. మళ్లీ 21 సంవత్సాలకు కృష్ణ, విజయ నిర్మల జంటగా 'దేవదాసు'ను మళ్లీ నిర్మించారు. ఈ చిత్రంలోని పాటలు బాగున్నప్పటికీ.. ఏయన్నార్ 'దేవదాసు' ముందు తేలిపోయింది. చివరికి పరాజయం మూటగట్టుకుంది.

**రేలంగి,** అంజలీదేవి జంటగా 1953లో వచ్చిన 'పక్కింటి అమ్మాయి' సినిమా ఆనాటి ప్రేక్షకులను అంతగా మెప్పించలేకపోయింది. 1981లో చంద్రమోహన్, జయసుధ కాంబినేషన్‌లో అదే కథతో, అదే టైటిల్‌తో విడుదలైన 'పక్కింటి అమ్మాయి' ప్రేక్షకులను అలరించింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సంగీత దర్శకుడు చక్రవర్తి ఇందులో కీలక పాత్రలు పోషించారు. రొమాంటిక్ కామెడీ చిత్రంగా రూపుదిద్దుకున్న 'పక్కింటి అమ్మాయి' మంచి విజయం సాధించింది.

**ఇలా** చెబుతూ వెళ్తే.. పాత కథతో, దాదాపు అదే కథనంతో వెండితెరపై అలరించిన సినిమాలు కొల్లలుగా కనిపిస్తాయి. కృష్ణ, విజయనిర్మల జంటగా వచ్చిన 'మీనా' అప్పట్లో ట్రెండ్ సృష్టించింది. యద్దనపూడి సులోచనా రాణి నవల ఆధారంగా విజయనిర్మల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా 1973లో విడుదలైంది. 43 ఏండ్ల తర్వాత ఇదే కథను కాలానుగుణంగా కొంత మార్చి 'అ.. ఆ'గా అందించాడు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ సినిమా కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'సంపూర్ణ రామాయణం' 1959లో విడుదలైంది. తొలుత తమిళ భాషలో రూపుదిద్దుకున్న ఈ సినిమాను తెలుగులోకి డబ్ చేశారు. తర్వాత పుష్కర కాలానికి 1971లో బాపు దర్శకత్వంలో శోభన్‌బాబు రాముడిగా వచ్చిన 'సంపూర్ణ రామాయణం' అద్వితీయ విజయాన్ని అందుకుంది. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' అపురూప చిత్రంగా నిలిచిపోయింది. బాపు, బాలకృష్ణ కాంబోలో వచ్చిన 'శ్రీరామ రాజ్యం' కథ కూడా లవకుశులదే!

**ఇలా** ఎన్నెన్నో సినిమాలు మళ్లీ మళ్లీ వచ్చి.. ప్రేక్షకులకు వినోదాన్ని పంచాయి. ఎస్వీఆర్ ప్రధాన పాత్రలో 1960లో 'హరిశ్చంద్ర' సినిమా వచ్చింది. 1965లో ఎన్టీఆర్ హీరోగా 'సత్యహరిశ్చంద్ర' మళ్లీ వచ్చింది. విజయ్‌చందర్ సాయిబాబాగా నటించిన 'శ్రీషిర్డీ సాయిబాబా మహత్యం' సినిమా 1986లో విడుదలై అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులోని పాటలు అమృతాన్ని పంచాయి. మళ్లీ నాగార్జున, రాఘవేంద్రరావు కాంబోలో 2012లో 'శిరిడిసాయి' విడుదలైంది. ఈ చిత్రం పెద్దగా విజయం సాధించకపోవడం గమనార్హం. 'భట్టివిక్రమార్క', 'విక్రమార్క విజయం' రెండూ ఒక తాను ముక్కలే! బాపు దర్శకత్వంలోనే వచ్చిన 'బంగారు పిచుక', 'పెళ్లికొడుకు' రెండు సినిమాల కథా ఒకటే! హిందీ 'డాన్' రీమేక్‌గా ఎన్టీఆర్ హీరోగా వచ్చిన సినిమా 'యుగంధర్' ఓ ట్రెండ్ సెట్ చేసింది. మళ్లీ ఇదే కథను 'బిల్లా' పేరుతో ప్రభాస్ హీరోగా పునర్ నిర్మించారు. ఇది కూడా విజయవంతమైంది.

**ఇదండీ** మళ్లీ మళ్లీ వచ్చిన సినిమాల కథాకమామిషు. తరచి చూస్తే ఈ తరహా చిత్రాలు మరిన్ని దొరుకుతాయి. కొన్ని అప్పుడు విజయవంతమై ఆ తర్వాత పరాజయం పాలయ్యాయి. మరికొన్ని అప్పట్లో పరాజయం చెంది.. మళ్లీ నిర్మించిప్పుడు హిట్టు కొట్టాయి. అయితే, తెలుగు సినిమాను ప్రేమించే సగటు ప్రేక్షకుడు మళ్లీ రావాలని కోరుకునే చిత్రాలు కొన్ని ఉన్నాయి. అందులో ప్రధానమైనవి మిస్సమ్మ, గుండమ్మ కథ, మాయాబజార్. తెలుగు సినిమా కీర్తి పతాకను రెపరెపలాడించిన ఈ చిత్రరాజాలను మళ్లీ ఎవరైనా తీయకపోతారా అని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సాహసం ఎవరు చేస్తారో చూడాలి!!